## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# ధరణీ ఉండాలె.. మళ్లీ కేసీఆరే రావాలె..

## కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో వెయ్యాలె..

- ధరణి తీసేస్తామంటున్న హస్తం నేతలపై రైతుల ఆగ్రహం
- పల్లెల్లో భూ కక్షలు పెరుగుతాయని మండిపాటు
- పటేల్, పట్వారీ వ్యవస్థతో రికార్డులన్నీ అస్తవ్యస్తమే..
- ధరణి తొలగిస్తే ఆగమవుతామని రైతుల ఆవేదన

**రైతుల భూములకు** ఎసరు పెట్టేందుకు... ప్రశాంతమైన పల్లెల్లో రైతుల మధ్య భూముల చిచ్చు రాజేసేందుకు హస్తం నేతలు ఆరాటపడుతున్నట్లు కనిపిస్తోంది. పదేండ్ల కిందట ఉన్న భూ కబ్జాలు, భూ రికార్డుల మార్పులు, దళారుల రాజ్యాన్ని మళ్లీ తెచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారు కాంగ్రెసోళ్లు. పొలం పనుల్లో బిజీబిజీగా ఉంటున్న అన్నదాతలను పోలీసు స్టేషన్లు, కోర్టు మెట్లు ఎక్కించి వారి బతుకులను ఆగం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వారి మాటల్లోనే తేటతెల్లమవుతున్నది. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలో రైతులంతా సుభిక్షంగా ఉంటుంటే.. కాంగ్రెసోళ్లకు కన్నుకుట్టినట్లున్నది. రైతుల మధ్య ఉన్న భూ పంచాయితీలను పూర్తిగా పరిష్కరిస్తూ, వారి భూములకు రక్షణగా ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు సీఎం కేసీఆర్. అత్యంత పారదర్శకంగా సేవలందిస్తున్న ధరణిని తీసివేసి.. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొచ్చి మా మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌ను ఖతం చేస్తామంటున్నారు అన్నదాతలు. ధరణీ ఉండాలె.. సీఎం కేసీఆరే రావాలె.. అయితేనే మా భూములన్నీ భద్రంగా ఉంటాయని అభిప్రాయపడుతున్నారు.

- నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్ 23

### కాంగ్రెస్ వస్తే దళారులొస్తరు..



తాడ్వాయి, నవంబర్ 23: కాంగ్రెస్ పార్టీ అంటేనే దళారులకు కొమ్ముకాసేది. రైతులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ధరణిని తీసేస్తాం అంటున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొచ్చి రైతుల భూములను ఇష్టం వచ్చినట్లు మార్చే పద్ధతికి శ్రీకారం చుట్టాలని చూస్తుండ్రు. ధరణిని తీసేస్తామని చెబుతున్న కాంగ్రెసోళ్లు.. తెలంగాణను ఏం అభివృద్ధి చేస్తరు. వాళ్లకు అధికారం ఒక్కటే యావ. రైతుల కోసం కేసీఆర్ ధరణి తీసుకొచ్చి బాగుచేస్తుంటే.. కాంగ్రెసోళ్లు రైతులను మోసం చేయాలని చూస్తున్నారు. ధరణిని తెచ్చిన కేసీఆర్‌కే మా మద్దతు. కాంగ్రెస్ మాటలు నమ్మం.

**- పి లక్ష్మీనారాయణ, సంగోజివాడి**

### కాంగ్రెస్ వస్తే భూములు ఆగమవుతాయి..



కాంగ్రెస్ హయాంలో రైతుల భూములకు రక్షణ కరువు. పైసలిస్తే ఇష్టమున్న వారి పేరుమీద భూములు మారేవి. దళారులు చెప్పినట్లే వ్యవస్థ మొత్తం నడిచేది. భూముల గురించి గొడవలు జరిగేవి. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత ఆ బాధలు పోయాయి. ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చి భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టిండ్రు. దీంతో చేతిలో ఉన్న ఫోన్‌లోనే ఎక్కడ ఉన్నా మా రికార్డులను మేం చూసుకుంటున్నాం. భూమి అమ్మినా, కొన్నా యజమాని వేలి ముద్ర పెడితేనే పట్టా మారుతుంది. ఇంత గట్టి వ్యవస్థను పెట్టిన కేసీఆర్‌ను కాదని మరొకరిని గెలిపిస్తమా? కేసీఆర్‌తోనే మా భూములకు రక్షణ. కేసీఆర్‌నే మళ్లీ గెలిపిస్తాం.

**- పి.చిన్నగంగారెడ్డి, రైతు, తాడ్వాయి**

### ఊర్ల మళ్లీ భూముల గొడవలు వస్తాయి..



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఊర్లల్లో మళ్లీ భూముల గొడవలు వస్తాయి. పటేల్, పట్వారీ వ్యవస్థతో భూ రికార్డులు సరిగ్గా లేక అప్పట్లో చాలా ఇబ్బందులు పడ్డాం. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులు ఇబ్బందులు పడకుండా ధరణిని తీసుకొచ్చిండు. మా భూములు, రికార్డులు మారకుండా బందోబస్తు పెట్టిండు. కేసీఆర్‌తోనే మాకు, మా భూములకు భరోసా. గొడవలు సృష్టించాలని చూస్తున్న కాంగ్రెస్‌ను తరిమేస్తాం. మేం సంతోషంగా ఉండేలా చూస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించుకుంటాం.

**- ఎ.రాంరెడ్డి, రైతు, దేవాయిపల్లి**

### ధరణి కొనసాగాల్సిందే.. కేసీఆర్ ఉండాల్సిందే..



సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తోనే మా భూముల రికార్డులు భద్రంగా ఉన్నాయి. కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ పాత కాలం నాటి పద్ధతులు మొదలవుతాయి. రెవెన్యూ పహాణీలు కావాలంటే తహసీల్ ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తుంది. ధరణి తీసేస్తే మాకు తీరని నష్టమే కలుగుతుంది. మళ్లీ బాధలు పడొద్దని అనుకుంటే ధరణి ఉండాల్సిందే.. కేసీఆర్ మళ్లీ సీఎంగా రావాల్సిందే. కాంగ్రెస్ మాటలు నమ్మకుండా సీఎం కేసీఆర్‌కే మద్దతు తెలుపుతాం.

**- సంగారెడ్డి, రైతు,బ్రాహ్మణపల్లి**





ధరణితో సులువైన రిజిస్ట్రేషన్

రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకొని పట్టా పాస్‌బుక్‌ను అందుకుంటున్న యజమానులు (పాత చిత్రం)


### పట్వారీలతో పట్టా మారాలంటే ఏండ్లు పట్టేది...



ఎల్లారెడ్డి, నవంబర్ 23: సీఎం కేసీఆర్ ధరణి తీసుకురాక ముందు పొలం పట్టా చేసుకోవడానికి అన్ని డాక్యుమెంట్లు ఉన్నా కూడా రికార్డుల్లోకి ఎక్కడానికి నాలుగేండ్లు పట్టింది. నాలుగుసార్లు జిరాక్స్ కాపీలు తహసీల్ ఆఫీస్‌లో ఇచ్చిన. పట్వారీ ఉంటే నాయబ్ తహసీల్దార్ ఉండడు, ఆయన ఉంటే గిర్దావార్ ఉండడు. గిట్ల అది రికార్డులకు ఎక్కేతందుకు నాలుగేండ్లు పట్టింది. పాస్ బుక్ వచ్చినంక మరోసారి ఆర్డీవో దగ్గరి నుంచి మళ్లీ బుక్ రావడానికి ఆరునెలలు పట్టింది. నేను పొలం కొనడానికి పైసలు ఖర్సు అయినయి కానీ రికార్డులకు ఎక్కడానికి గోసగోస అయింది. సీఎం కేసీఆర్ ఉంటేనే ఈ వ్యవస్థ బాగుంటుంది.

**- కట్ట సాయిలు, రైతు, రామక్కపల్లి**

### అందరికీ లంచాలు ఇస్తేనే పని అయ్యేది...



పొలం కొనగానే పని కాకుండే. అందరికీ లంచాలు ఇస్తేనే కొన్న భూమి మన పేరు మీదకు వచ్చేది. రిజిస్ట్రేషన్ కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టడంతోపాటు అది అమలు కావడానికి వేలు ఖర్సు పెట్టినా పని ఆలస్యంగా అయ్యేది. తహసీల్ ఆఫీసులో పడిగాపులు పడినా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఒక్కటే రోజులో ధరణి పోర్టల్ మూలంగా పని అవుతున్నది. మీ సేవలో స్లాట్‌బుక్ చేసుకుంటే ఎవ్వరికీ రూపాయి లంచం ఇవ్వకుండానే పేరు మీదకు భూమి వస్తున్నది.

**- శ్రావణ్‌కుమార్, రైతు, గండిమాసానిపల్లి.**

### ధరణితో పైసా లంచం ఇచ్చే పనిలేదు..



భూమి కొన్న తర్వాత దానిని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి డాక్యుమెంట్ రైటర్ దగ్గరికి పోయే పనిలేదు. వాళ్లకు వేల రూపాయలు ఇచ్చేదీ లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చాలన్ కట్టాలి. మన ఇష్టం వచ్చిన రోజున రిజిస్ట్రేషన్ పెట్టుకోవచ్చు. ఆ రోజు తహసీల్ ఆఫీసుకు పోతే ఆడనే ఒక్క రూపాయి అడగకుండా గంటలోనే రిజిస్ట్రేషన్ అయిపోతుంది. వెంటనే అది రెవెన్యూ రికార్డుల్లోకి మారుతుంది. మన భూమి ఎప్పుడైనా పేరు మారిందా అనే విషయం ఎక్కడైనా మీ సేవ కేంద్రాల్లో చూసుకోవచ్చు.

**- లింగాల సామెల్, రైతు, అడ్విలింగాల.**

### భూములు గుంజుకోవాలని చూస్తుండ్రు..



కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే.. ధరణిని తీసేసి.. రైతుల భూములను గుంజుకోవాలని చూస్తుండ్రు. ఇప్పుడున్న ధరణితోనే మా భూములు, రికార్డులు భద్రంగా ఉన్నాయి. పాత పద్ధతి తెచ్చి మాకు తెల్వకుండానే మా భూములను మాయం చేయాలని కాంగ్రెసోళ్లు చూస్తున్నట్లున్నరు. ధరణి పోతే మళ్లీ పాత బాధలే వస్తాయి. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు. రైతుల భూములకు భద్రత కల్పించి, భరోసానిస్తున్న సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకుందాం.

**- సాకలి గంగయ్య, దేవాయిపల్లి**